

నియోజకవర్గ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

# పక్కాగా ఇంటింటి సమగ్ర సర్వే

**నివాస ప్రాంతాల్లో ఇళ్ల జాబితాను త్వరగా రూపొందించాలి: ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్**

మామిళ్లగూడెం, నవంబర్ 1: జిల్లాలో ఈ నెల 6 నుంచి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి నియోజకవర్గ అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా నివాస ప్రాంతాల్లో ఇళ్ల జాబితా రూపకల్పన త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సర్వేకు కావాల్సిన ఎన్యూమరేటర్ల గుర్తింపు, బ్యాగులు, స్టేషనరీ, సామగ్రి సేకరణ వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సర్వే కోసం ఎన్యూమరేషన్ బ్లాక్‌లోని ప్రతి ఇంటికి క్రమానుగత సంఖ్యను కేటాయించాలని, ఇళ్ల జాబితా పక్కాగా రూపొందితే సర్వే సమగ్రంగా నడుస్తుందన్నారు. నిర్దేశిత సర్వే ప్రణాళికను అనుసరిస్తూ మూడు రోజుల్లోపు హౌజ్ లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. దీనిపై సూపర్‌వైజర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, శిక్షణకు ఏర్పాట్లు చేయడంతోపాటు డాటా నమోదుకు ఆపరేటర్లను సిద్ధంగా ఉంచాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ, సీపీవో శ్రీనివాస్, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, డీఈతో సోమశేఖర శర్మ, అదనపు డీఆర్‌డీవో నూరొద్దీన్, డీఎల్‌పీవో రాంబాబు పాల్గొన్నారు.

# ప్రజలు ఐక్యతాభావంతో మెలగాలి

**రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



కొత్తగూడెం కలెక్టరేట్‌లో సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రజలందరూ భేదాభిప్రాయాలను విడిచిపెట్టి ఐక్యతాభావంతో మెలగాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా గురువారం ఐడీవోసీ కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి కలెక్టర్, అదనపు కలెక్టర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతి ఐక్యతపై అధికారులు, సిబ్బందితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దాస్య శృంఖలాల్లో చిక్కుకొని సంక్షోభంలో ఉన్న భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని భగత్‌సింగ్ నుంచి మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ వంటి గొప్ప నాయకులు ఎన్నో ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీవో సంజీవరావు, బీసీ సంక్షేమాధికారి ఇందిర, ఏవో రమాదేవి, జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

# రేపు ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

- హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి
- విలేకరుల సమావేశంలో టీజీజేఏసీ రాష్ట్ర సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు



ఖమ్మంలోని చెరుకూరి మామిడి తోటలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం, నవంబర్ 1: ప్రభుత్వ ఉద్యోగులలో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు, వారిలో ఉత్సాహాన్ని, ఐక్యతను పెంపొందించేందుకు ఈ నెల 3న తెలంగాణ ఉద్యోగుల గెజిటెడ్ ఆఫీసర్స్, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్స్ కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనంతో వన సమారాధన నిర్వహించున్నట్లు టీజీ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని గొల్లగూడెం రోడ్డులో గల చెరుకూరి మామిడి తోటలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు, నాగిరెడ్డి, టీజీవో నాయకులు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి వేలాద్రి, గుంటుపల్లి శ్రీనివాస్, కొణిదెల శ్రీనివాస్, జయపాల్, ఇతర నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సైతం హాజరవుతారని, 206 సంఘాలతో జేఏసీ ఏ విధంగా ఏర్పడిందో అదే విధంగా దీనికి పూర్వ వైభవం తీసుకురావడానికి ఈ ప్రయత్నమని అన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్, సీపీలను ఆహ్వానించామన్నారు. ఉద్యోగ ఆత్మీయ సమ్మేళనానికి ఉద్యోగ కుటుంబ సభ్యులు భారీగా తరలిరావాలని కోరారు. నగరంలోని ఆరు సెంటర్ల నుంచి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# అపరిష్కృత సమస్యలు పరిష్కరిస్తాం

- విధి నిర్వహణలో నిబంధనలు అతిక్రమించొద్దు
- హోంగార్డు ఆఫీసర్ల ఆత్మీయ సమావేశంలో ఖమ్మం సీపీ



ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌కు వినతిపత్రం అందిస్తున్న హోంగార్డులు

మామిళ్లగూడెం, నవంబర్ 1: అపరిష్కృతంగా ఉన్న హోంగార్డు ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ కల్యాణ మండపంలో హోంగార్డు ఆఫీసర్ల శాఖాపరమైన సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు శుక్రవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి సీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న హోంగార్డు ఆఫీసర్ల సమస్యలు తన పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరిస్తానని, ప్రభుత్వపరంగా ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. విధి నిర్వహణలో పోలీసులకు సహాయకారిగా ఉండే హోంగార్డు ఆఫీసర్లకు వ్యక్తిగత క్రమశిక్షణ, సమయపాలన చాలా ముఖ్యమన్నారు. హోంగార్డులు తమ దృష్టికి తీసుకొచ్చిన ఆసుపత్రి ట్రీట్‌మెంట్‌లో రాయితీ, పిల్లల కళాశాలల ఫీజులో రాయితీ కోసం సంబంధిత యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖలో విధి నిర్వహణలో నిబంధనలు అతిక్రమించొద్దని ఆయన సూచించారు. అనంతరం హోంగార్డు ఆఫీసర్ల విశ్రాంతి కోసం నిర్మిస్తున్న బ్యారక్‌ను సందర్శించి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం హోంగార్డు ఆఫీసర్లు తమ సమస్యలతో కూడిన వినతిపత్రం సీపీకి అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన సీపీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) ప్రసాద్‌రావు, ఎస్బీ ఏసీపీ సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

# దీపావళి.. దేదీప్యం

- ఉమ్మడి జిల్లాలో భక్తిశ్రద్ధలతో దివాళీ వేడుకలు
- పటాకులు పేల్చి చిన్నారుల సంబురాలు

వెలుగు జిలుగుల దీపావళి పండుగను ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు గురువారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగ దీపావళి. ఉదయాన్నే ఇళ్ల ముంగిళ్లను శుభ్రం చేసి మామిడి తోరణాలు, అరటి ఆకులు, బంతి పూల మాలలతో ఆకర్షణీయంగా అలంకరించారు. ఇంటిల్లిపాదీ నదీ స్నానాలతోపాటు ఇళ్లలోనూ స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేయడంతోపాటు ఇళ్లలోనూ లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దీపావళి పండుగ సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వెలుగుల పండుగ రోజు నుంచి అంతా మంచే జరగాలని వేడుకున్నారు. తమ వృత్తి, వ్యాపారాల్లో ఐశ్వర్యాలు సమకూరాలని అమ్మవారికి మనస్ఫూర్తిగా మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వేళ ఇళ్ల ఎదుట మహిళలు, యువతులు రంగవల్లులను తీర్చిదిద్ది.. ప్రమిదల్లో ఒత్తులు వేసి దీపాలు వెలిగించారు. వ్యాపార సముదాయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలు, పెద్దలు అనే తారతమ్యం లేకుండా కుటుంబ సభ్యులంతా కలిసి పటాకులు పేల్చుతూ సంబురంగా గడిపారు. చిన్నారులైతే చిచ్చుబుడ్లు, కాకర పూవొత్తులు కాలుస్తూ సందడి చేశారు. వారి కేరింతలతో కుటుంబ సభ్యులు, బంధువులు పండుగను ఆనందమయంగా జరుపుకున్నారు.

–నమస్తే నెట్‌వర్క్



చింతకానిలో..



ఖమ్మంలో..



రెండు కాకరపూలతో చిన్నారి సంబురం



లక్ష్మీ పూజలో గృహిణి



దమ్మపేటలో మెచ్చా..



బూర్గంపహాడ్‌లో..



కాకర పూవొత్తి కాల్చుతున్న ఎమ్మెల్యే రాగమయి



పాల్వంచలో..



పటాకులతో వెళ్తున్న యువకులు



ఖమ్మంలో పెద్ద చిచ్చుబుడ్డి వెలిగిస్తున్న కుటుంబ సభ్యులు



ఇల్లెందులో పటాకులు కాల్చుతున్న దిండిగాల





ఖమ్మంలో పటాకులు కాల్చుతున్న సండ్ర కుటుంబ సభ్యులు

# నేటి నుంచి కేయూ అంతర్ జిల్లా అథ్లెటిక్స్

ఖమ్మం సిటీ, నవంబర్ 1: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల క్రీడాకారులకు అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలు శనివారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు కేయూ పీజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రవికుమార్ తెలిపారు. నగరంలోని కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరగనున్న పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని డిగ్రీ, పీజీ, ఫార్మసీ తదితర కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించనున్న పోటీల్లో 21 టీంల నుంచి 200 మంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ కే ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, కేయూ క్యాంపస్ క్రీడా కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరావు, జిల్లా క్రీడాధికారి సునీల్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. అధ్యాపకులు కే ప్రసాదరావు, పీ కోటి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్

## పెరిగిన ఆయిల్‌పాం గెలల ధర



అశ్వారావుపేట, నవంబర్ 1: అక్టోబర్ నెలకు సంబంధించి ఆయిల్‌పాం గెలల ధర మరో రూ.2 వేలు పెరిగింది. సెప్టెంబర్ నెలలో టన్ను ఆయిల్‌పాం గెలల ధర రూ.17,043 ఉండగా.. అక్టోబర్ నెలకు రూ.2,101 పెరిగి.. రూ.19,144లకు చేరింది. ఈ మేరకు ఆయిల్‌ఫెడ్ అధికారులు శుక్రవారం హైదరాబాద్‌లో కొత్త ధర ప్రకటించారు. ఆగస్టు నెలలో టన్ను గెల ధర రూ.14,392 ఉండగా.. నూనె దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం సుంకం విధించింది. దీంతో ఆయిల్‌పాం గెలల ధర పెరిగింది. సెప్టెంబర్ నెలకు రూ.2,651, అక్టోబర్ నెలలో మరో రూ.2,101 చొప్పున గెలల ధర పెరగడంతో ఆయిల్‌పాం రైతులు ఆనందపడుతున్నారు. ప్రస్తుతం గెలల సేకరణ సీజన్‌లో ధర పెరగడం సాగు రైతులకు మరింత ఉత్సాహాన్నిస్తున్నది. పెరిగిన ధర అక్టోబర్ నెలలో ఫ్యాక్టరీకి తరలించిన గెలలకు మాత్రమే వర్తిస్తుందని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ తెలిపారు.

# ఒకటో తేదీకల్లా బియ్యం చేరాలి

**ఎంఎల్ఎస్ పాయింట్ల తనిఖీలో అదనపు కలెక్టర్ శ్రీజ**



హమాలీలకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

రఘునాథపాలెం, నవంబర్ 1: జిల్లాలోని ప్రతి రేషన్ షాపునకు ఒకటో తేదీకల్లా బియ్యం చేరవేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ ఎంఎల్ఎస్ పాయింట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంపిణీ తేదీ ప్రారంభమైనా రేషన్ షాపులకు బియ్యం తోలకాలు చేపట్టకపోవడంతో గోదాం ఇన్‌చార్జిపై మండిపడ్డారు. ప్రతి నెలా జాప్యం జరగడానికి గల కారణాల గురించి ఇన్‌చార్జి అధికారిని అడిగి తెలుసుకున్నారు. మరో రెండు రోజుల్లోనే షాపులన్నింటికీ బియ్యం చేరవేయాలని ఆదేశించారు. అంతేకాక గోదాం నుంచి లారీల ద్వారా బియ్యం చేరవేసే హమాలీలతోనూ అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఆమె వెంట అర్బన్ సివిల్ సప్లై డీటీ విజయ్‌బాబు, గోదాం ఇన్‌చార్జి ఆర్ఐలు ఉన్నారు.

## పిల్లల సంరక్షణకు పక్కా చర్యలు

మామిళ్లగూడెం, నవంబర్ 1: పిల్లల సంరక్షణకు అధికారులు పక్కా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ అన్నారు. పిల్లల సంరక్షణపై తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షించారు. జిల్లాలో పిల్లల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తున్నట్లు చెప్పారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల నిర్మూలనకు విద్యాశాఖ, సంక్షేమ శాఖ, వైద్యారోగ్య శాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో యాంటీ డ్రగ్స్ యాక్షన్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు రాంగోపాల్‌రెడ్డి, సోమశేఖరశర్మ, జ్యోతి, కేవీబీ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి కార్తీక పూజలు

- భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు
- 15న కార్తీక పౌర్ణమి, 27న నదీహారతి: ఆలయ ఈవో రమాదేవి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి

భద్రాచలం, నవంబర్ 1: కార్తీక మాసం సందర్భంగా భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఉప ఆలయమైన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం (శివాలయం)లో శనివారం నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. భద్రాచలంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్తీక మాస పూజా కార్యక్రమాల వివరాలను ఆమె వెల్లడించారు. కార్తీక మాసంలో నాలుగు 4, 11, 18, 25 సోమవారాల్లో విశేష పూజలు ఉంటాయని, 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, 17న స్వామివారి కల్యాణం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇక్కడి ఉమారామలింగేశ్వరస్వామి, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాలు 400 ఏళ్ల క్రితం నిర్మించడంతోపాటు మహిమానిత్వమైనవని, కార్తీక మాస పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. 27న గోదావరి నదీహారతి ఉంటుందని, ఇక్కడ స్వామి వారి పాదుకలతో పూజలు చేస్తారని తెలిపారు. మహిళా భక్తులు అత్యధిక సంఖ్యలో తరలిరానున్నందున ఆలయం వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, కార్తీకమాసంలో ఉదయం, సాయంత్రం ప్రసాదాలు అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఆలయ అర్చకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.